# నగరంలో డ్రగ్స్ దందా

- యువతీ, యువకుడి అరెస్ట్
- 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): గోవా కేంద్రంగా.. నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఒక యువతితో పాటు మరో యువకుడిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 11గ్రాముల ఎండీఎంఏ, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం.. యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంతానికి చెందిన కొండెం ప్రియాంక రెడ్డి అలియాస్ ప్రియా(29) ఆర్కిటెక్చర్. వృత్తిపరంగా నగరానికి వలసొచ్చి, మాదాపూర్, సిలికాన్ వ్యాలీ ప్రాంతంలోని న్యూ పాష్‌ప్లేస్ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటున్నది. ఏపీలోని విజయనగరం ప్రాంతానికి చెందిన శ్రీతేజ(29) టెక్ మహేంద్రలో పనిచేస్తున్నాడు. వృత్తిపరంగా నగరానికి వలస వచ్చిన అతడు మాదాపూర్‌లోని శ్రీలక్ష్మి బాలాజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఇద్దరు కలిసి నగరంలో డ్రగ్స్ విక్రయించడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగా గోవాలో స్థానికంగా ఉండే శివ, భరత్‌కుమార్‌రెడ్డి ద్వారా రష్యాకు చెందిన అనా అనే మహిళ వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తారు. వీరి వద్ద నుంచి నగరంలోని కొండాపూర్‌కు చెందిన దినేశ్, దయానో, గిరీశ్, అఖిల్ డ్రగ్స్ కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలోనే ఇటీవల గోవాకు వెళ్లి వచ్చిన ప్రియా, శ్రీతేజ గురువారం రాత్రి షాద్‌నగర్‌లోని యమ్మి హోటల్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ దేవకి తన సిబ్బందితో కలిసి యువతీ, యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి 11గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వారిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇచ్చిన సమాచారం



మేరకు నగరంలో వారి వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వారితో పాటు గోవాలో మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న నిందితుల కోసం వేట మొదలు పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

## బెంగళూరు కేంద్రంగా..

### ఫిల్మ్‌నగర్‌లో వ్యక్తి అరెస్టు

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): బెంగళూరు కేంద్రంగా.. నగరంలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఒక అంతర్రాష్ట్ర డ్రగ్ వ్యాపారిని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.20లక్షల విలువ చేసే 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన శివ్రాంపూర్ బాబు కిరణ్ (26) కారు డ్రైవర్. వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. దీనికి తోడు



డ్రగ్స్‌కు బానిసయ్యాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన డ్రగ్స్ వ్యాపారి దినకరణ్‌కు దగ్గరయ్యాడు. సులువుగా డబ్బు సంపాదించాలని భావించిన కిరణ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూనే.. డ్రగ్స్ విక్రయించే దినకరణ్ సూచన మేరకు హైదరాబాద్‌లో మత్తు పదార్థాలు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే దినకరన్ వద్ద నుంచి రూ.6వేలకు ఒక గ్రాము చొప్పున ఎండీఎంఏ డ్రగ్‌ను కొనుగోలు చేశాడు. శుక్రవారం ఫిల్మ్‌నగర్ మూన్‌షైన్ పబ్ వద్ద విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. సమాచారం అందుకున్న పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. ఫిల్మ్‌నగర్ పోలీసులతో కలిసి నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.20 లక్షలు విలువ జేసే 20 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఫిల్మ్‌నగర్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ శ్రీబాల పర్యవేక్షణలో ఛేదించిన ఈ కేసు దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ ఖలీల్‌పాషా, ఫిల్మ్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ ఎంజీఎస్.కృష్ణ, ఎస్‌ఐ షేక్ కవ్వుద్దీన్ పాల్గొన్నారు.

## పిల్లలు పుట్టడం లేదని రెండో పెళ్లి

### నిలదీసిన భార్యపై దాడి

బంజారాహిల్స్, డిసెంబర్ 29: పిల్లలు పుట్టడం లేదని రెండో పెళ్లి చేసుకున్న భర్తను నిలదీయడంతో భార్యపై తీవ్రంగా దాడి చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మినీ గుల్షన్ కాలనీకి చెందిన సనా నౌషీన్‌కు నాలుగేళ్ల కిందట షేక్ యూనిస్‌తో వివాహమైంది. వివాహం తర్వాత భార్యాభర్తలిద్దరూ సౌదీలో ఉన్నారు. అయితే, సనా నౌషీన్‌కు పిల్లలు పుట్టకపోవడంతో తరచూ భర్త యూనిస్ ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఇటీవల సెలవుల్లో భార్యాభర్తలిద్దరూ నగరానికి వచ్చారు. యూనిస్ రహస్యంగా రెండోపెళ్లి చేసుకున్న విషయాన్ని ఈ నెల 27న భార్య సనా నౌషీన్ తెలుసుకుని గట్టిగా నిలదీసింది. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన యూనిస్.. ఆమెను చితకబాదడంతో పాటు శరీరంలోని పలు భాగాలపై కొరకడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో బాధితురాలిని జూబ్లీహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 324, 323 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మైనర్‌పై అఘాయిత్యం.. 20 ఏండ్ల జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): నమ్మకంతో ఆశ్రయమిచ్చిన యజమాని కూతురు మైనర్(6)పై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడు తాజెబుల్ ఖాన్(22)కు 20 ఏండ్ల జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానా విధించడంతోపాటు బాధితురాలి కుటుంబానికి పది లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. అదనపు పీపీ సునీత కథనం ప్రకారం.. మీర్‌పేట పరిధిలో బాలిక తండ్రి చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో పనిచేసేందుకు బీహార్‌కు చెందిన తాజెబుల్ ఖాన్‌ను సహాయకుడిగా నియమించుకున్నాడు. బాధితురాలి కుటుంబానికి నిందితుడుతో పరిచయం ఉండటంతో వారి ఇంట్లోనే ఉంటూ షాపులో పనిచేస్తున్నాడు. అయితే, 2022, మార్చి 29వ తేదీ రాత్రి యజమాని మైనర్ కూతుళ్లు గదిలో నిద్రిస్తుండగా నిందితుడు బాలిక గదిలోకి వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనుమానాస్పద ప్రవర్తనను గమనించిన బాలిక తల్లి ప్రశ్నిస్తుండగా.. నిందితుడు పారిపోయాడు. జరిగిన ఉదంతంపై బాలిక తల్లి మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు తాజెబుల్ ఖాన్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న పబ్స్‌పై డీసీపీకి ఫిర్యాదు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: నిబంధనలను తుంగలో తొక్కుతూ నడుస్తున్న బంజారాహిల్స్ రోడ్ నం.14లోని పబ్స్‌ను మూసేయించాలని స్థానికులు వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. కేబీఆర్ పార్కు నుంచి తెలంగాణ భవన్ వైపు వెళ్లే రోడ్డులో ఉన్న రాక్ క్లబ్ స్కైలాంజ్, రయట్ పబ్, టాస్ కేఫ్ బార్ పేర్లతో నడుస్తున్న పబ్బుల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, బార్ డ్యాన్సర్లను నియమించుకొని యువతను ఆకర్షిస్తున్నారని బంజారాహిల్స్‌కు చెందిన హైదర్ అనే వ్యక్తి వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పబ్స్ వద్ద సరైన పార్కింగ్ సదుపాయం కూడా లేదని, రోడ్డుపై అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేయడంతో పాటు రాత్రిపూట డీజే సౌండ్‌తో స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): అదనపు కట్నం కోసం కట్టుకున్న భార్యను వేధించిన భర్త ఎం.ఆరోగ్యయ్య అలియాస్ ఎం.ఏ.రాజుకు ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మూడో అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కొత్త రవి తీర్పునిచ్చారు. అసిస్టెంట్ పీపీ గోపాల్ కథనం ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన సుమ శ్వేత వివాహం గుంటూరు జిల్లాకు చెందిన ఆరోగ్యయ్యతో 2008లో జరిగింది. కట్నకానుకలతో ఘనంగా వివాహం చేశారు. అనంతరం నిందితుడు భార్య, కూతురు బాగోగులను పట్టించుకోకుండా అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా వేధించాడు. దీంతో ఆమె సరూర్‌నగర్ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అనంతరం అన్ని ఆధారాలతో పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

### డెలివరీ చేయాల్సిన ఫోన్‌ను..

## తస్కరించిన కొరియర్ బాయ్

బంజారాహిల్స్, డిసెంబర్ 29: అమెజాన్ కొరియర్ ద్వారా వచ్చిన సెల్‌ఫోన్‌ను తస్కరించి, పనిచేస్తున్న సంస్థను మోసం చేసిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. టోలీచౌకి సమీపంలోని నదీమ్ కాలనీలోని నివాసముంటున్న సయ్యద్ అర్బాజ్ అమెజాన్ ద్వారా వచ్చిన పార్సిల్స్‌ను డెలివరీ చేస్తుంటాడు. ఇటీవల సీతానగర్‌కాలనీ ఉంటున్న ఓ వ్యక్తికి రూ.75 వేల విలువైన శ్యామ్‌సంగ్ జెడ్ ఫ్లిప్ 4 మోడల్ ఫోన్‌ను డెలివరీ ఇచ్చేందుకు వెళ్లాడు. కస్టమర్ ఫోన్ డెలివరీ రిజెక్ట్ చేశాడు. అయితే, ఆ ఫోన్‌ను అమెజాన్ సంస్థకు వెనక్కి పంపాల్సిన అర్బాజ్.. ఫోన్ తీసుకుని ఉడాయించాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో శుక్రవారం అమెజాన్ సంస్థ ప్రతినిధి నాగసుబ్బారెడ్డి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 406,420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిమ్స్‌కు ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ కితాబు

### అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ కేంద్రం పనితీరుపై ప్రశంసలు

ఖైరతాబాద్, డిసెంబర్ 29 : నిమ్స్‌లోని క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగంలోని అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ కేంద్రం పనితీరును ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ ప్రశంసించింది. ఈ విభాగంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు శుక్రవారం క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.ఉషారాణి, డిప్యూటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.పద్మజా, ఆ విభాగం అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అభినందనలు తెలిపారు.



క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ విభాగం వైద్యులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

## వజ్రాభరణాలు చోరీ

### పని మనిషిపై కేసు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: పనిచేస్తున్న ఇంట్లో ఆభరణాలు తస్కరించిన పని మనిషిపై కేసు నమోదైంది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 8లోని సెలెస్టా వైట్‌హౌజ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న కొడాలి ధనలక్ష్మి సెప్టెంబర్ 16న కుటుంబంతో కలిసి మంగోలియా పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో కప్‌బోర్డులో ఉన్న మూడు వజ్రపు గాజులు, బంగారు గాజుతో పాటు ఖరీదైన వాచి ఉన్న బాక్సును ఒక బ్రీఫ్‌కేస్‌లో పెట్టారు. పక్కింటి ఫ్లాట్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు వెళ్లి.. అరగంట తర్వాత వచ్చిన ధనలక్ష్మి, తదితరులు నేరుగా ఎయిర్ పోర్టుకు వెళ్లిపోయారు. మంగోలియా వెళ్లిన రెండు రోజుల తర్వాత లగేజీని తెరిచిన సమయంలో బ్రీఫ్‌కేసులో పెట్టిన ఆభరణాలు కనిపించలేదు. ప్రయాణం హడావుడిలో ఆభరణాలను బ్రీఫ్‌కేసులో పెట్టకపోయి ఉండవచ్చని, బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డులోనైనా, బ్యాంకు లాకర్‌లోనే ఉండవచ్చని ధనలక్ష్మి బావించారు. ఈ నెల 24న మంగోలియా నుంచి తిరిగి వచ్చిన ఆమె కప్‌బోర్డులో చూడగా ఆభరణాలు కనిపించలేదు. ఈ నెల 27న లాకర్‌లో వెతికినా ఆభరణాలు కనిపించలేదు. తాను మంగోలియా వెళ్లే ముందు అరగంట సేపు బయటకు వెళ్లిన సమయంలో తన ఇంట్లో పనిమనిషి శ్రీలత మాత్రమే ఉన్నదని, ఆమెపైనే అనుమానం ఉన్నదంటూ శుక్రవారం బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.10 లక్షల విలువైన ఆభరణాలు మాయమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శబరిమలకు ప్రత్యేక సర్వీసు




మారేడ్‌పల్లి, డిసెంబర్ 29: అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం జనవరి 5వ తేదీన హైదరాబాద్ నుంచి శబరిమలకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి జనవరి 5వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఈ ప్రత్యేక సర్వీసు బస్సు బయలుదేరి, 3 గంటలకు మహాత్మాగాంధీ నుంచి శబరికి బయలుదేరుతుందన్నారు. ఈ సర్వీసులో శబరిమలతో పాటు జోగులాంబ, కాణిపాకం, భవానీ, గురువాయర్, ఛోటానిక్కర్, ఎరుమేలి, పంబ, తిరువనంతపురం, మధురై, అరుణాచలం, కంచి, మహానంది దర్శనం ఉంటుందన్నారు. ఒక ప్రయాణికుడికి భోజన వసతితో కలిసి రూ.13,940 ఉంటుందని, వివరాలకు పికెట్ డిపో 9959226250, స్టేషన్ మేనేజర్ జేబీఎస్ 9959226246 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.